# సుఖం కావాలి

జి. సి. హెచ్. వెంకటేశ్వర్లు

"నేను కావ్యాన్ని కాదు, నేను పదార్థాన్ని కాదు. నేను మంచిని కాదు. చెడ్డనూ కాదు. నేను గౌరవం కాదు. అగౌరవాన్నీ కాదు........." పెరుమాళ్లు గారి ఉవాచ ప్రారంభమైంది. ఎంత ప్రశాంతంగా కూర్చున్నాడు! కృష్ణాజినంపై పద్మాసనం వేసుకొని కూర్చున్నాడు. అర్థనిమీలిత నేత్రాలతనికున్నయ్. నున్నగా గొరిగించిన తల. మెడలో రుద్రాక్షమాలలు. విశాలమైన నుదిటిపై విభూతిరేఖలు. గంభీరమైన స్వరంతో, చిరునవ్వుతో కశ్శార్పకుండా తీవ్రంగా బోధిస్తున్నారు.

"నేను ఆకాశాన్ని కాదు. నేను భూమినీ కాదు. నేను జలాన్ని కాదు. నేను వాయువునీ కాదు, నేను అగ్నిని కాదు........." చెప్పుకుపోతున్నారు.

సూరమ్మగారు రెండు కలకత్తా జామపండ్లు వారెదుటుంచి నమస్కరించి జనంలో కూర్చొంది. రంగమ్మ కూతురు పంపరపనసపండొకటి వారి పాదాలదగ్గరుంచి ప్రణమిల్లి తరించింది. ఫలాలు సమర్పించారు. ఒక్క క్షణంలో ఆ వేదిక పళ్ళ దుకాణంలా అన్నివిధాల ఫలాల్తో నిండింది. తల్లులొడిలో కూర్చున్న పిల్లలు గుటకలు మింగుతూ చూస్తున్నారు. ఒకరా కాయల్ని భద్రంగా మూటగట్టి వారి ప్రక్కనుంచారు.

ఇదంతా జరుగుతున్నా పెరుమాళ్ళవారు చెప్పట మాపలా. వారు కొనసాగిస్తూనే ఉన్నారు. "నేను నిత్యం కాదు, నేననిత్యం కాదు. నేను వెలుతుర్ని కాదు, వెలుగునూ కాదు. చీకటినీ కాదు........"

ఇందాకటినుంచి వింటున్న సుబ్బయ్యకిక ఓపిక లేకపోయింది వినటానికి. అయినా ఏంచేస్తాడు నడిచే శక్తిలేనప్పుడు. చల్లని ఆ పందిరినీడలో అట్లాగా చతికిలబడి వింటున్నాడు.

ఏమిటని వింటాడు. అతని కేమీ అర్థం కావటం లేదు. వెలుగు కాదట, చీకటీ కాదట, ఏదీ కాదట. మరేమిటిక వీడి మొఖం. ఒక్కటీ సరిగ్గా చెప్పడేం. ఏదీ కాదంటాడు. ఏది మరి? అన్నీ లేకపోతే, ఏదీ కాకపోతే ఇక మిగిలిం దేమిటి? ఆలోచిస్తున్నాడు ప్రశ్నలు వేసుకుంటూ సుబ్బయ్య.

ఆలోచించి ఆలోచించి ఒక నిశ్చయానికొచ్చాడు — దారేదో తనకు తెలియనిది చెప్పుకుంటున్నారు. వెధవ నిశాని కొయ్యకు నాకేం తెలుస్తుంది. ఆ అర్థం ఆ వేదాంతం అనుకున్నాడు.

అసలు వేదాంతమంటే అర్థం కానిదని అతనికి తెలియదు. ఈ వేదాంతులంతా ఏ విధంగా పీఠంపై కెక్కారో అతనికేం తెలుసు మరి. వేదాంతమంటే ఇతరు లర్థం చేసుకోలేనిది. వాక్యంలోని అన్ని పదాల కర్థం తెలుస్తుంది. తాత్పర్యం తెలుసుకోవాలని ప్రయత్నిస్తే అంతుచిక్కదు.

'గుప్పిట మూయండి ఏమిటి చూస్తున్నావు. గుప్పిట తెరువు. ఏమిటి మార్పు. ఈ రెంటికీ తారతమ్యమే నిశ్చలతత్వం.' ఇట్లా ఉంటుంది వేదాంతం. చెప్పేవారి కర్థమౌతుందా? అది వారికే తెలియరానిది. తెలుసుకోవాలని ప్రయత్నించినా తెలుసుకోబడనిది. కొందరు ప్రయత్నించి ఒక్కో అర్థం ఒక్కొక్కరు సాధిస్తారు. అదీ వేదాంతం.

ఈ చిక్కులన్నీ సుబ్బయ్య కేమి తెలుసు. ఇన్ని మెలికలున్నాయని అతనెప్పుడూ అనుకోలేదు.

"అశాశ్వతంలోనుండి శాశ్వతం జనిస్తుంది. అనిత్యంనుండి నిత్యముద్భవిస్తుంది. అపకారంనుండి ఉపకారం పుట్టుకొస్తుంది. కష్టంనుండి సుఖం పుడుతుంది..."

అక్కడాపాడు. వెనుతిరిగి రాగిచెంబు పాలు గుక్క త్రిప్పుకోకుండా సేవించారు. కండవాతో మూతి తుడుచుకొని చిన్న తేపు తెమిల్చాడు. ఎదురుగా పసిపిల్లవాడు వాళ్లమ్మను కౌగలించుకొని వణికాడు. దూరంగా గాటికి కట్టివేసిన పెయ్య పారిపోదామని తన్నుకుంది, 'అంబా' అని అరచింది.

అతని ఆఖరు వాక్యాలు విన్నాడు సుబ్బయ్య — 'కష్టంనుండి సుఖం పుడుతుంది' నిజంగానా? అతనికళ్ళు మెరిసినై. సంతోషంతో పొంగిపోయాడు. తన కష్టాలుపోయి ఎప్పుడయినా సుఖం వస్తుందా. స్వాముల వారు చెపుతున్నారు నిజమెందుకు కాకూడదు!' అతని కనుమానంలో ఆనందం పొటమరించింది.

స్వాములవారి ఆ వాక్యం సుబ్బయ్యకు సరిపడింది. ఇందాకటినుండి వింటున్నదతని కేమి రుచించలా. దాని సారం యీ ఒక్క వాక్యంలోనే ఉందనుకున్నాడు. అతని అజ్ఞానంలో వెలితిగా ఉన్న కొరవను ఆ మాటలు పూర్తిచేసినై. తన దుఃఖపు లోతుల్లో సుఖమనే ముత్యాలున్నాయని అతను సంతసించాడు.

'నాకేం తెలుస్తయ్ వారిమాటలు. తెలుసుకోక మొదట తిట్టాను. తప్పు చేశాను.' చెంపలు వాయించుకోబుద్ధేసింది సుబ్బయ్యకు.

తన కష్టాలనుండి సుఖం వస్తుందా? ఎట్లా వస్తుంది? ఎప్పుడు వస్తుంది? అతను భవిష్యత్తులో షికారు చేశాడు.

సుబ్బయ్య చక్కిడాలమ్ముకునే సుబ్బయ్య. కాంతమ్మదగ్గర అరువుకేసుకొని అమ్ముతుంటాడు. రోజూ మూడువందల చక్కిడాలమ్మడు పోయేటప్పటికి గగనమౌతుంది. ఆ ఊళ్ళో సుబ్బయ్య ఒక్కడేనా! పొట్ట చేత్తో పట్టుకుతిరిగే సుబ్బయ్యలు చాలమందున్నారు. అందరూ ఒకే పనిచేసుకుంటున్నా, ఒకర్ని చూస్తే ఒకరికి కోపం. ఉన్న బేరమంతా వాడే కాజేస్తున్నాడని వీడు. వీడు కాజేస్తున్నాడని వాడు.

పోటీలు పడినట్లు బస్సుస్టాండుదగ్గరా, సినిమాహాల్సుదగ్గర, అరచినవాడు అరచినట్టే ఉంటాడు సుబ్బయ్య. సాయంత్రం ఎనిమిది గంటలదాకా తచ్చాడి తిరిగి కాంతమ్మింటికి చేరుకుంటాడు. వచ్చిన కానుల్ని అర్ధణాల్ని ఆమె చేతిలో పోస్తాడు. ఇచ్చిన కూలీ జేబులో వేసుకొని ఇంటికి పోతాడు. త్రోవలో ఒకర్థణా బీడీలు కొనుక్కుంటూనే సుమా.

ఇంటికంటే వాళ్ళింటికి కాదు. సుబ్బయ్యకిల్లు లేదు. వల్లాటి పెద్దమ్మకల్లే తన కాదరమిచ్చేది. అక్కడికెళ్ళి కాస్త అన్నం తింటాడు. అదిమాత్రం ఊరికే పెడుతుందా. పావలా ఫీజు చెల్లించుకుంటాడు. వల్లెంలో కాలప్రకారం ఒక కవర్ చేసి, ఇంత కారిది కారమో, గోంగూర పచ్చడో వేస్తుంది. దాంతో తినిది తేవాలి. అంతటితోనే ఆ పెద్దమ్మ ఋణం తీరదు. మూడుగడ్డికావాలన్నా, ఇంట్లో నెచ్చాలు తెచ్చిపెట్టాలన్నా సుబ్బయ్యే చేయాలి ఆ పనులన్నీ.

అన్నం తిన్న తరువాత కడుపునిండా మంచినీళ్లు పోస్తాడు. "ఇంట్లో నీళ్ళన్నీ నీ పొట్టకే పోస్తున్నా. ఎక్కడ నీళ్లు నీకే హరించిపోతున్నయ్"అని ఒకవైపు తిడుతూ పోసిన ఆ నీళ్లు త్రాగుతాడు. బీడి కాల్చుకుంటూ సినిమాహాలుదగ్గర కెళ్తాడు మిగిలిపోయిన చక్కిడాలు వేసుకొని. సినిమా ఒదిలిపెట్టేదాకా ఉంటాడు. సూరమ్మకు రెండో లెక్క అప్పచెప్పి మళ్ళీ బజారు వెళ్తాడు. కొంచెందూరం నడిచి అటు ఇటు

# ★ సుఖం కావాలి ★

చూచి ఒక సందులోకి వెళ్తాడు. అదొక పూరిల్లు. దాంట్లో ప్రవేశిస్తాడు జేబులో డబ్బులు తడుముకుంటూ. వచ్చేటప్పుడు దొంగల భయముండదు. పూర్తిగా మత్తెక్కి ఇంటిముఖం పడతాడు. అతని కిల్లు లేదు. మరెక్కడికి? పెద్దమ్మింటికా? రాత్రి అక్కడికి రానీయదు. అన్నం తినేవరకే అది సుబ్బయ్యిల్లు. రోడ్డువెంబడి ఏ చెట్టు క్రిందనో, కొట్టు అరుగునో ప్రోవతీస్తాడు. కొంచెంసేపు హుషారుగా పాడతారు. ఆ పాట కంతుండదు. సినిమా పాటలు అవీ అన్నీ దాంట్లో ఉంటయ్. సంగీతంతో పాడుతున్నానని సంతసిస్తాడు. ఎప్పుడో నిద్రపడుతుంది. తెల్లవారేదాకా ఏమీ తెలియదు. అప్పటికిగాని కైపు దిగదు. అతనికి కలలుకూడా రావేమో. తెల్లవారగానే మళ్లీ మొదలు 'చక్కిడాలు! చక్కిడాలు!'

ఎంతకాలంనుండలా! ఎన్ని రోజుల నుండి అరుస్తున్నాడు! ఎన్నిసార్లు అరచాడు! చక్కిడాల సుబ్బయ్యని ఊరంతా గుర్తించగలిగారంటే ఎన్నిసార్లు గొంతు సారించుంటాడు?

ఎవరు పిలిచినా 'చక్కిడాల సుబ్బయ్యా'నే. అతని కింటిపేరు లేదు. ఉన్నా అతనికి తెలియదు. అతనెవరో అసలతనికి తెలియదు. ఇక యితరుల కెలా తెలుస్తుంది? ఒకటిమాత్రం అతనికి బాగా గుర్తు - చచ్చిపోయిన పుల్లమ్మపిన్ని బ్రతికుండగా చెప్పుతుండేది. 'మీఅమ్మ చెడి నిన్నుకని భూమిమీద పడేసి చచ్చింది. అప్పటినుండి నేనే పెంచాను. నిన్నింతటివాడిని చేశాను. నాకూ ఎవ్వరూ లేరు. నేనూ అడుక్కుతినేదాన్నే. నన్నెట్లా ఎల్లమారుస్తావో' అనేది. ఆమాటలు గుర్తుకొచ్చినప్పుడేడుస్తాడు. ఎవరికీ చెప్పడు. అడిగినా బదులు చెప్పడు. ఏమిటేమిటో ఆలోచించుకొని కుమిలిపోతాడు. అతని జీవితంలో కంట తడిపెట్టి విచారించేవిషయ మదొక్కటే.

తను హాయిగా బ్రతుకుతున్నాడో సుఖంగా బ్రతుకుతున్నాడో అతనికి తెలియదు. అతని జీవితం కష్టమో, దరిద్రమో అంతకన్నా తెలీదు. ఆ పదాల కర్థమే ఊహించలేడు.

ఏవో నాలుగు డబ్బులు సాయంత్రానికి మిగుల్తయ్. వాటితో రెండుడ్రాములసారా వస్తుంది. అది త్రాగి ఊరుకుంటాడు. లేకపోతే సినిమాకు పోతాడు. ఎక్కడో పడుకుంటాడు. తెల్లవారి లేచేదాకా అక్కడున్నానని అతనే తెలుసుకోలేడు. దుమ్ము దులుపుకొని రత్తమ్మదగ్గర కెళ్తాడు. 'చక్కిడాలు! చక్కిడాలు!' అరవటం మొదలుపెడతాడు.

అతనికి రెండువారాలనుండి తెలుస్తుంది కష్టమంటే ఏమిటో. చలిజ్వరం తగిలింది. ఉండుండి నరా లుండచుట్టుకు పోతయ్. పనిలో కెళ్ళటం మానేశాడు. ఇన్నాళ్ళు రత్తమ్మ కొదా చేసిచ్చినా అవసర మొచ్చినప్పుడాదుకోలా సుబ్బయ్యను. అప్పేమీ యీయలా. పెద్దమ్మ మహాకష్టంమీద అన్నం పెడుతుంది. అదీ ఒకపూట పెడితే మరోపూటుండదు. ధర్మాసుపత్రి మందు త్రాగాడు. ప్రయోజనమేమీ లేదు. ప్రయోజనం ఏ సుబ్బయ్యకూ ఉండదు. మంచినీళ్లకన్నా తేలికా మందనబడే సీసాల్లో ద్రావకాలు. వాటి కేరుములూ ఉండవు. రెండు వారాలనుంచి సేవిస్తున్నాడా మందు. ఏమీ తగ్గలేదు. సూదిమందేస్తే త్వరగా పోతుందని డాక్టరు చెప్పాడు. కాని రెండు రూపాయలన్నా యిచ్చుకోవాలట. ఎవర్నడిగినా ఉత్తచేతులు బోర్లించేవారేకాని 'యిదుగో సుబ్బయ్యా యీ అర్ధపుచ్చుకో, ఇంకెవరినైనా మరో అర్ధ అడుగు' అన్నవారు లేకపోయారు. చలిజ్వరంతో దగ్గుకూడా ప్రారంభమైంది. అన్నంలేక ఎండుకున్న డొక్కల్ని దగ్గతో బాధపరచేసరికి రొప్పు, ఆయాసం ప్రబలినై. సుబ్బయ్యింకెన్నో రోజులు బ్రతకడని రత్తమ్మింకెవరితోనో అంటుండగా కూడా ఒకసారి విన్నాడు. ఇదంతా అతనికి కష్టమనిపించింది.

చలివేస్తుంది, అది అతని కష్టం. దగ్గు వస్తుంది. అదే అతని కష్టం.

"కష్టంలోనుండి సుఖం పుడుతుంది. నిజమేనా? నా చలిజ్వరం పోతుందా? సుఖపడతానా?" అని ఆలోచిస్తున్నాడు.

కష్టమంటే చలిజ్వరం
సుఖమంటే జ్వరం పోవటం

అదీ అతను గ్రహించింది. అతనికి సుఖం కావాలి. అంటే కట్టుకోటానికి సిల్కుపంచెలు, పట్టుఉత్తరీయాలు అవసరం లేదతనికి. తింటానికి హల్వాలు, పలావులు, లడ్డూ లతను కోరటంలా. ఉండేందుకు మిద్దెలు, మేడలు వాంఛించటం లేదు. అవేమీ సుబ్బయ్య కవసరంలా. అవి సుఖం కాదు. చలిజ్వరం పోవాలి, అది సుఖం. అది కావాలతనికి.

"ఈశావాస్యం. మనుజున కొక ప్రకృతి. లోకోభిన్నరుచిః. కాని కామం అందరికీ ఉంది. అది పోవాలి. అది నిశ్చలమైన స్వరూపం. భోగాన్ని త్యాగం జేయాలి. ఆనాడావిర్భవించిన సుఖాని కంతుండదు"

మళ్ళా సుబ్బయ్య సుఖమనే పదం విన్నాడు. 'ఉంది సుఖం' అనుకున్నాడు. పూర్తయింది కాలక్షేపం. హారతిచ్చారు. లేచిపోయారు భక్తులు. సుబ్బయ్య చలితో వణకుతూ అన్నాడు.

"సుఖం కావాలి"
"సుఖం కావాలి"


రిజిసరు నెం. 1905 వసంతమునకు ప్రత్యేక కానుక తంతి "Republic"

## గొప్ప బహుమతులు: మీరు ఒక బహుమతి గెలువండి!

అన్నియు గ్యారంటీ బహుమతులు :-

ప్రతి ఆల్ కరెక్టుకు రు. 6000/- ప్రతి మొదటి రెండు వరుసలు కరెక్టుకు 1000/
ప్రతి మొదటి ఒక వరుస కరెక్టుకు 100/- ప్రతి మొదటి రెండు నెంబర్లు కరెక్టుకు 20/-

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

2 నుండి 17 వరకు గల అంకెలను యీగళ్ళలో నిలువుగా, అడ్డముగా, అయిమూలగా యెటు కూడినా 38 వచ్చునట్లు వేయాలి. ఒక అంకె ఒకేమారు వాడాలి.

ఆఖరు పోస్టింగ్ తేది 18-3-54 ఫలితములు : 26-3-54

ఒక ఎంట్రీకి ప్రవేశరుసుము : రు. 1/- 4 ఎంట్రీలకు రు. 3/-
16 ఎంట్రీల సెట్టుకు రు. 10.

గత పోటీ ఫలితం

| | | | |
|---|---|---|---|
| 7 | 15 | 10 | 2 |
| 4 | 6 | 11 | 13 |
| 14 | 12 | 5 | 3 |
| 9 | 1 | 8 | 16 |

మొత్తము 34

రూల్సు: పై రేటుప్రకారం ఫీజు పంపుచూ, తెల్ల కాగితముపై యెన్ని యెంట్రీలైనా పంపవచ్చును. ఎంట్రీల వెంట మనియార్డరు రశీదుగాని, పోస్టల్ ఆర్డరుగాని, బ్యాంకి డ్రాఫ్టుగాని, జతపర్చవలెను. "మీరట్" లోని ఒక గొప్పబ్యాంకిలో డిపాజిటు చేయబడిన సీల్డు సొల్యూషనుతో సరిపోలిననే, సొల్యూషనుగాని లేక వరుసలుగాని క్రమముగా ఉన్నదని తెలిసికొనవలెను. సొల్యూషనులో ఇంగ్లీషు అంకెలే వాడండి. ఉత్తరాలు ఇంగ్లీషులోనే వ్రాయాలి. ఫలితములు త్వరగా తెలుసుకొనవలెనన్న, స్వంత అడ్రసుగల స్టాంపు కవరు ఎంట్రీలతో కూడా పంపండి. మేనేజరు తీర్మానము ఆఖరు, చట్టబద్ధమైనది. మీ ఎంట్రీలు ఫీజుతో పంపవలసిన అడ్రసు :-

LIBERTY CONCERNS Regd., (A M), P. B. 86, Sadar, MEERUT (U·P)